మంగళవారం 'వందేభారత్' బంద్

గిర్మాజిపేట, ఆగస్టు 9: వరంగల్ మీదుగా విశాఖపట్టణం -సికింద్రాబాద్ -విశాఖపట్టణం మధ్య రాకపోకలు సాగిస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఇకపై మంగళవారం నడవవని, మిగిలిన ఆరు రోజులు నడుస్తాయని ఈస్ట్ కోస్ట్ రైల్వేచీఫ్ ప్యాసింజర్ ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ (ట్రాఫిక్ సేఫ్టీ) డీసీ ప్రధాన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం ఆదివారం మినహా మిగిలిన ఆరు రోజులు వందేభారత్ సర్వీసులు నడుస్తున్నాయని, ఇక నుంచి ఆదివారానికి బదులుగా మంగళ వారం ఈ సర్వీసులు నడవవని ప్రయాణికులు గమనించాలన్నారు.


ఉర్సు నాగమయ్య గుడిలో..


ప్రత్యేక అలంకరణలో భద్రకాళి అమ్మవారు

శ్రావణ సందడి

శ్రావణమాస తొలి శుక్రవారం.. అందునా నాగులపంచమి కావడంతో నగరంతో పాటు జిల్లాలో ని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళల సామూహిక వరలక్ష్మి వ్రతాలు, ప్రత్యేక పూజలు, పారాయణాలు, అన్నదానాలతో దేవాలయాలు ఆధ్యాత్మిక సందడిని సంతరించుకున్నాయి. వరంగల్ భద్రకాళి దేవాలయం భక్తులతో పోటెత్తింది. మరోవైపు నాగుల పంచమిని కూడా ఘనంగా జరుపుకున్న భక్తులు నాగేంద్రస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. నాగేంద్రుడి పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.


కేయూలో ఆదివాసీ నృత్యాలు చేస్తున్న యువత

ఆదివాసీ పండుగ

ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాకతీయ యూనివర్సిటీలో మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు సాంస్కృతిక ర్యాలీ, పతాకావిష్కరణ జరిపారు. అనంతరం సెనెట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి మాట్లాడారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని దాంతో ఆ తెగలకు చెందిన విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు.



బల్దియాలో భూ ఆక్రమణలకు చెక్

వరంగల్ కార్పొరేషన్, ఆగస్టు 9 : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధి 66 డివిజన్‌లలో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటల ఆక్రమణలకు చెక్‌పెట్టడంతో పాటు భూ అక్రమాలు, కబ్జాలకు పాల్పడే వారిపై కొరఢా ఝుళిపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. సరికొత్త యాప్‌తో కబ్జాదారులు ఆక్రమించిన భూములను గుర్తించేందుకు కసరత్తు మొదలు పెట్టింది. రాష్ట్రంలో హైదరాబాద్, వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. హైదరాబాద్‌లో (హైడ్రా), వరంగల్ బల్దియాలో డీఆర్‌ఎఫ్ (డిజాస్టర్ రెస్పాన్స్ ప్రొటెక్షన్ ఫోర్స్) బృందాలను ఏర్పాటు చేసింది. ఇటీవల ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఆదేశాలు వెలువడడంతో రెండు రోజుల కిందట బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అప్రమత్తమయ్యారు. నగరవ్యాప్తంగా ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారి నుంచి తిరిగి భూములను స్వాధీనం చేసుకోవడం, అక్రమ కట్టడాలను తొలగించేందుకు డీఆర్‌ఎఫ్ టాస్క్‌ఫోర్స్ ప్రధాన భూమిక పోషించాలని సూచిస్తూ మూడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో డీఆర్‌ఎఫ్ సిబ్బందితో పాటు టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్, రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్, ట్రాఫిక్ పోలీసు, ఆర్ అండ్‌బీ శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశారు. బల్దియాలో నూతనంగా ఏర్పడిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ప్రధానంగా ప్రభుత్వ ఆధీనంలో ఉండి అన్యాక్రాంతమైన నాలాలు, డ్రైనేజీ కాల్వలు, రోడ్లు, కాలనీలు, జంక్షన్లు, చెరువులు, కుంటలు, కెనాల్ స్థలాలు, స్మశాన వాటికలు, ప్రభుత్వ విద్యాసంస్థల స్థలాలు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టుపక్కల మిగిలి ఉన్న స్థలాలు ఆక్రమించిన కబ్జాదారులపై కొరఢా ఝుళిపించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు.

సీఎం సమీక్షలో అంకురార్పణ

వరంగల్ ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై 29 జూన్ 2024న జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, బల్దియా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి హైదరాబాద్ కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో సమీక్ష జరిగింది. వరంగల్ నగరంలో జరిగిన, జరుగుతున్న ప్రభుత్వ భూ ఆక్రమణలపై సుదీర్ఘంగా చర్చించారు. తర్వాత ముఖ్యమంత్రి వరంగల్ నగరంలోపాటు హైదరాబాద్‌లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ఆయాశాఖల అధికారులు దృష్టి సారించాలని, ప్రభుత్వ ఆస్తులలో అక్రమ కట్టడాలు కూల్చివేత, ఆక్రమించిన భూములు స్వాధీనం చేసుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన కమిషనర్ ఆదేశాల మేరకు పది ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో డీఆర్‌ఎఫ్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో పదిమంది చొప్పున మూడు బృందాలు 24/7 అన్నట్టుగా రియల్టర్లు, కబ్జాదారులు ఆక్రమించిన ప్రభుత్వ భూములు గుర్తించే పనిలో పడ్డారు. టాస్క్‌ఫోర్స్ బృందాలకు రౌడీషీటర్లు, రాజకీయ నాయకులు భయభ్రాంతులకు గురిచేసినా బెదరకుండా ముందుకు సాగుతున్నారు.

ప్రభుత్వ ఆస్తుల రక్షణే మా ధ్యేయం

- శంకర్‌లింగం, డీఆర్‌ఎఫ్ ముఖ్య అధికారి



"బల్దియా పరిధిలోని భూములకు కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశాల మేరకు డీఆర్‌ఎఫ్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. పది ప్రభుత్వ శాఖల అధికారులు ఈ దళం లో పని చేస్తారు. హైదరాబాద్ తర్వాత వరంగల్ నగరంలోనే టాస్క్‌ఫోర్స్ బృందాలు ఏర్పాటు చేశాం. ప్రతీరోజు కొన్ని డివిజన్లను ఎంపిక చేసుకుని ప్రత్యేక యాప్ ద్వారా ఆక్రమించిన స్థలాలను గుర్తించి జియో ట్యాగింగ్ ద్వారా గుర్తించి ఆన్‌లైన్ చేస్తాం. తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అక్రమ కట్టడాలు కూల్చివేస్తాం."

- ప్రత్యేక భద్రతా దళాలతో రక్షణకు సర్కారు చర్యలు
- 'ఆపరేషన్ డీఆర్‌ఎఫ్ టాస్క్‌ఫోర్స్' పేరుతో బృందాలు
- పది శాఖల సమన్వయంతో నిర్వహణ
- సీఎం ఆదేశాలతో సర్వం సిద్ధం
- కబ్జాలను గుర్తించేందుకు ప్రత్యేక యాప్
- జియో ట్యాగింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు


హనుమకొండలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

జియో ట్యాగింగ్‌తో భూముల గుర్తింపు

వరంగల్ నగరంతో పాటు నగర శివార్లు, విలీన గ్రామాలలో ఆక్రమణకు గురైన భూములు, చెరువులు, కుంటలను డీఆర్‌ఎస్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది జియో ట్యాగింగ్ ద్వారా గుర్తిస్తున్నారు. టాస్క్‌ఫోర్స్ టీములలో పనిచేసే సిబ్బందికి ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను అందించింది. వారి వద్ద ఉన్న సెల్‌ఫోన్‌కు ప్రభుత్వ యాప్‌ను అనుసంధానం చేసుకుని కమిషనర్‌కు, కలెక్టర్‌కు, సీఎం క్యాంపు కార్యాలయానికి, పోలీసు కమిషనర్‌కు వచ్చిన ఫిర్యాదులపై స్పందిస్తున్నారు. ఆయా డివిజన్‌లలో బృందాలు విడిపోయి అక్రమ కట్టడాలను గుర్తించి ఆన్‌లైన్‌లో డాటా పొందుపరుస్తున్నారు. అక్రమ కట్టడాలను ఎప్పటికప్పుడు గుర్తించి ఉన్నతాధికారులతో పాటు సంబంధిత డీఎఫ్‌వోకు తెలియజేస్తున్నారు. 8వ తేదీన గ్రేటర్ పరిధిలోని 4, 5, 6, 17 డివిజన్‌లు, 9వ తేదీన 9, 10, 55 డివిజన్‌లలో అక్రమ కట్టడాలను గుర్తించినట్టు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది తెలిపారు. అక్రమ కట్టడాల పై పూర్తి సమాచారాన్ని సేకరించిన వెంటనే డీఆర్‌ఎఫ్ ఫుల్ టీం, టౌన్ ప్లానింగ్, ఇంజ నీరింగ్, పోలీసుల సమన్వయంతో కూల్చివేతలు ప్రారంభించి చట్టపర మైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలా అక్రమ కట్టడాలు, నిర్మాణాలపై నిరంతర ప్రక్రియ జరుగుతుందని, ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బల్దియా అధికారులు హెచ్చరిస్తున్నారు.



మత్తడి పోస్తున్న పాకాల

ఖానాపురం, ఆగస్టు 9 : జిల్లాలోనే సాగునీటి వనరుల్లో పెద్దదైన పాకాల సరస్సు శుక్రవారం మత్తడి పోస్తూ కనువిందు చేస్తోంది. పాకాల సరస్సు పూర్తి నీటిసామర్థ్యం 30.2అడుగులు కాగా, ప్రస్తుతం 30.4 అడుగులకు చేరింది. దాంతో రెండు ఇంచుల మత్తడి పోస్తుండడంతో ఆయకట్టు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా మత్తడితో పరవళ్లు తొక్కుతున్న పాకాల సరస్సును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా నర్సంపేట ఏఎంసీ వైస్‌చైర్మన్ శాఖమూరి హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు పాకాల కట్టమైసమ్మ, మత్తడి వద్ద పూజలు నిర్వహించారు. మత్తడిలో పసుపు, కుంకుమలు చల్లి గంగమ్మ తల్లికి హారతి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

కార్యక్రమంలో నాయకులు వీరమనేని సాగర్‌రావు, ముస్తఫా, పల్నాటి శ్రీను, శాగంటి వెంకటేశ్వర్లు, దేవినేని వేణుగోపాల్‌రావు, భానుప్రసాద్, వల్లె రవి, రాములు, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

కూతురు సహా జర్నలిస్టు ఆత్మహత్య

- హనుమకొండలోని తన ఆఫీసులో ఉరేసుకున్న యోగిరెడ్డి
- భార్య కుటుంబసభ్యుల కన్నీరుమున్నీరు


కూతురుతో జర్నలిస్టు యోగిరెడ్డి (ఫైల్)

బాలసముద్రం, ఆగస్టు9: ఓ యూట్యూబ్ చానల్ జర్నలిస్టు తన కూతురుతో కలిసి ఉరివేసుకుని బల వన్మరణానికి పాల్పడిన సంఘటన హనుమకొండ బాలసముద్రంలో శుక్రవారం జరిగింది. సుబేదారి సీఐ సత్యనారాయణరెడ్డి, స్థానికులు, తోటి జర్నలిస్టులు చెబుతున్న వివరాల ప్రకారం.. జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం వనపర్తి గ్రామానికి చెందిన గెట్టుకొప్పుల యుగంధర్‌రెడ్డి అలియాస్ యోగిరెడ్డి (36) పలు యూట్యూబ్ చానళ్లలో పనిచేశాడు. అయితే ప్రస్తుతం అతడు పనిచేస్తున్న ఓ యూట్యూబ్ వారు ఇటీవల అతడిని ఉద్యోగం నుంచి తొలగించారని, ఆ అవమానానికి ఆర్థిక ఇబ్బందులు తోడయ్యాయని, దాంతోనే యోగిరెడ్డి ఆత్మహత్య చేసుకున్నాడని అనుమానిస్తున్నారు. మూడు రోజుల క్రితం బాలసముద్రంలోని ఏకశిలపార్కు సమీపంలోని తన ఆఫీసులోని కంప్యూటర్లను తీసేశాడని చెబుతున్నారు. కూతురు అంటే ఎంతో ప్రేమ ఉన్న యోగిరెడ్డి.. తాను చనిపోతే తన కూతురు ఆద్యరెడ్డి (10)భవిష్యత్ ఎలా ఉంటుందోనన్న ఆందోళనతోనే కూతురుకు కూడా ఉరేసి.. తాను ఉరే సుకున్నాడని చెబుతున్నారు. అయితే ఉదయం

మిగతా 8వ పేజీలో »

జీవకోటికి మొక్కలే ఆధారం

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి
లక్నేపల్లిలో కలెక్టర్ సత్యశారద


లక్నేపల్లి హైస్కూల్‌లో విద్యార్థితో మొక్క నాటిస్తున్న కలెక్టర్

నర్సంపేట టౌన్, ఆగస్టు 9 : జీవకోటి మనుగడకు మొక్కలే ఆధారమని, అందుకే పర్యావరణ పరిరక్షణకు ప్రతీఒక్కరు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని కలెక్టర్ సత్యశారద సూచించారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా లక్నేపల్లి జడ్‌పీహెచ్‌ఎస్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలకు చెందిన ప్రతీ విద్యార్థి తన జన్మదినం సందర్భంగా మొక్కను నాటి సంరక్షించాలని సూచించారు. అనంతరం వ్యాస రచన, వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ స్వచ్ఛదనం-పచ్చదనం నిరంత రం కొనసాగిం చాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉం చుకోవాలన్నా రు. ఈమేరకు గ్రామంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవర ణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, సెంటర్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని, నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఏవో కౌసల్యాదేవి, జడ్‌పీ సీఈవో రామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి పటిష్ఠ ఏర్పాట్లు చేయాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, ఆగస్టు 9: స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 15న ఖిలావరంగల్‌లోని ఖుష్ మహల్ మైదానంలో నిర్వహించే వేడుకల్లో జెండా వందన కార్యక్రమానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర సమరయోధుల కుటుంబాలకు, ఇతర అతిథులకు వేడుకలకు ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. ఎగ్జిబిషన్ స్టాళ్లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయా శాఖల్లో విశిష్ట సేవలు అందించిన ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు ప్రతిపాదనలు గడువులోగా అందించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సఖీ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలి

న్యాశాయంపేట, ఆగస్టు 9: సఖీ సెంటర్ సేవలను మహిళలు ఉపయోగించుకోవాలని సఖీ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి అన్నారు. న్యాశాయంపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో శుక్రవారం సఖీ అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో ప్రభుత్వ హైస్కూల్ ప్రిన్సిపాల్ సరోజ, టీచర్లు సరళ, సౌందర్య, మహేశ్వరి, అంబప్రసాద్, చంద్రమోహన్, నరసింహరావు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

అకడమిక్ డీఎంఈ రాజీనామా!

- ఆ పోస్టు తనకొద్దంటూ సర్కారుకు శివరాంప్రసాద్ లేఖ
- కొత్త వైద్య కళాశాలలకు అనుమతులు తేవాల్సిందేనని ఉన్నతాధికారుల ఒత్తిడి!
- అది భరించలేకనే తప్పుకొన్న శివరాం?

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడు డాక్టర్ శివరాంప్రసాద్ తన పదవికి రాజీనామా చేశారు. తనను ఆ పోస్టు నుంచి తప్పించాలని కోరుతూ ప్రభుత్వానికి లేఖ రాశారు. తాను అకడమిక్ డీఎంఈగా విధులు నిర్వహించలేని పరిస్థితుల్లో ఉన్నానని లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. వైద్యవిద్య సంచాలకుల పరిధిలో జరిగిన సాధారణ బదిలీల కంటే ముందే ఆయన సర్కారుకు రాజీనామా లేఖను పంపినట్లు తెలుస్తోంది. అయితే ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గత కొద్ది రోజులుగా ఆయన డీఎంఈ కార్యాలయానికి కూడా రావడం లేదు. వైద్యవిద్య అకడమిక్ సంచాలకుడిగా తీవ్రమైన పనిభారం, ఉన్నతాధికారుల ఒత్తిడి తట్టుకోలేకనే ఆ పోస్టు నుంచి తప్పుకొన్నారని శివరాంప్రసాద్ సన్నిహితులు చెబుతున్నారు. ప్రస్తుతం కొత్తగా 8 వైద్య కళాశాలల్లో ఈ ఏడాది నుంచి ప్రవేశాలను చేపట్టాలని ప్రభుత్వం భావిస్తోంది. కానీ, అధ్యాపకులు, సౌకర్యాల లేమి కారణంగా 8 కాలేజీలకు జాతీయ వైద్య మండలి అనుమతి ఇవ్వలేదు. దీనిపై డీఎంఈ కార్యాలయం అప్పీలుకు వెళ్లగా.. నాలుగింటికి అనుమతులు వచ్చాయి. మరో నాలుగు పెండింగ్‌లో ఉన్నాయి. ఎలాగైనా సరే వాటికి అనుమతులు తీసుకురావాల్సిందేనని ఉన్నతాధికారులు డీఎంఈ కార్యాలయంపై ఒత్తిడి తీసుకొచ్చారు. అది భరించలేకనే ఆయన అకడమిక్ డీఎంఈ పదవి నుంచి వైదొలగినట్లు తెలుస్తోంది.

పెద్దాపూర్ గురుకులంలో విద్యార్థి మృతి

- అర్ధరాత్రి ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత
- తెల్లవారుజామున ఆస్పత్రికి తరలింపు
- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- టీచర్ల నిర్లక్ష్యమేనని బంధువుల ఆరోపణ

మెట్‌పల్లి రూరల్, ఆగస్టు, 9: అర్ధరాత్రి అస్వస్థతకు గురైన ఇద్దరు గురుకుల విద్యార్థులను తెల్లవారుజామున ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమించి ఒకరు మృతి చెందగా.. మరొకరు ప్రాణాపాయ స్థితిలో చికిత్స పొందుతున్నారు. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండలంలోని పెద్దాపూర్ క్యాంపులోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటు చేసుకుంది. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలంలోని బొప్పాపూర్ గ్రామానికి చెందిన ఎలమాడల అనిరుధ్ (11), జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి చెందిన మొండి మోక్షిత్ గురుకులంలో ఆరోతరగతి చదువుతున్నారు. వీరిద్దరూ గురువారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయారు. అయితే అర్ధరాత్రి సమయంలో అస్వస్థతకు గురయ్యారు. శుక్రవారం ఉదయం 5.30 గంటల సమయంలో పీఈటీ వెళ్లగా.. కడుపు నొప్పిగా ఉందని అనిరుధ్, మోక్షిత్‌లు తెలిపారు. దీంతో వెంటనే కేర్‌టేకర్‌లు, అనిరుధ్ తల్లికి ఫోన్‌లో సమాచారం ఇచ్చి వారిని కోరుట్ల ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అనంతరం విషమంగా ఉందని తెలపడంతో వెంటనే జిల్లా కేంద్రంలోని ఆస్పతికి తీసుకెళ్లారు. అప్పటికే విషయం తెలిసి వైద్యుడు కూడా అయిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్.. విద్యార్థులు పాము కాటుకు గురై ఉండవచ్చని అందుకు తగిన వైద్యం చేయాలని ఆర్మూర్‌లో వైద్యులకు సూచించారు. అక్కడ వైద్యం అందించి నిజామాబాద్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే అనిరుధ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మోక్షిత్ పరిస్థితి కూడా విషమంగా ఉండడంతో చికిత్స అందిస్తున్నారు. ఇటు పాఠశాలలో ప్రార్థనా సమయంలోనే ఆరో తరగతి చదువుతున్న హేమంత్ అనే మరో విద్యార్థి కూడా కళ్లు తిరుగుతున్నాయని కింద పడిపోయాడు. గమనించిన ఉపాధ్యాయులు మెట్‌పల్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. కాగా, 2 వారాల క్రితం ముగ్గురు విద్యార్థులు ఇదే విధంగా అస్వస్థతకు


అనిరుధ్ (ఫైల్)

గురయ్యారు. వీరిలో చికిత్స అనంతరం ఇద్దరు కోలుకోగా.. 8వ తరగతి చదివే ఆర్.గణాధిత్య (13) మృతి చెందాడు. అయితే వీరు పాము కాటుకు గురైనట్లు సమాచారం.

ఎమ్మెల్యే సంజయ్ ఆగ్రహం..

విద్యార్థి అనిరుధ్ మృతి విషయం తెలిసి కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ గురుకులానికి చేరుకున్నారు. విద్యార్థి మృతికి కారణాలేంటని అక్కడి ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అయితే తమకేం తెలియదని వారు సమాధానం చెప్పడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు, విద్యార్థుల వరుస మరణాలకు ఉపాధ్యాయుల నిర్లక్ష్యమే కారణమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలలో వసతులు సరిగా లేవని.. తమ పిల్లల భద్రత మాటేంటని అధికారులను ప్రశ్నిస్తున్నారు.

ప్రాణం తీసిన ఇన్‌స్టా స్నేహం

- ప్రేమ పేరిట యువకుడి వేధింపులు.. బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య


తేజస్విని (ఫైల్)

గుమ్మడిదల, ఆగస్టు 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన వ్యక్తితో చేసిన స్నేహం ఓ యువతి ప్రాణాలు తీసింది. ప్రేమ పేరుతో ఆ యువకుడి వేధింపులు భరించలేక ఓ బీఫార్మసీ విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. తమ ఇంటి భవనంపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం దోమడుగు గ్రామంలో గురువారం రాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. దోమడుగు గ్రామానికి చెందిన రాజు, సోనీ దంపతులకు ఓ కుమారుడు, కుమార్తె తేజస్విని(20) ఉన్నారు. బీఫార్మసీ సెకండియర్ చదువుతున్న తేజస్వినికి అదే గ్రామానికి చెందిన శ్రీహరి కొద్ది రోజుల క్రితం ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. కొద్ది రోజుల తర్వాత తనను ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని శ్రీహరి వేధించడం మొదలుపెట్టాడు. ఇదే విషయమై తేజస్విని కుటుంబసభ్యులను కూడా బెదిరించాడు. దీంతో తేజస్విని ఇంట్లో నాలుగు రోజుల క్రితం కూడా గొడవ జరిగింది. ఈ క్రమంలో శ్రీహరి వేధింపులు తాళలేకపోయిన తేజస్విని గురువారం రాత్రి తమ ఇంటి భవనం మూడో అంతస్తు నుంచి దూకేసింది. రక్తపుమడుగులో పడి ఉన్న తేజస్వినిని కుటుంబసభ్యులు హుటాహుటిన సూరారంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించింది.

పీర్జాదిగూడ కార్పొరేషన్ హస్తగతం

పీర్జాదిగూడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఖాతాలోకి మరో మునిసిపల్ కార్పొరేషన్ చేరింది. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డిపై కాంగ్రెస్ కార్పొరేటర్లు ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. కీసర ఆర్డీవో వెంకట ఉపేందర్‌రెడ్డి సమక్షంలో శుక్రవారం నగర పాలక మండలి సమావేశం జరిగింది. మొత్తం 26 మంది కార్పొరేటర్లు ఉండగా.. అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా 21 మంది ఓటు వేశారు. దీంతో మేయర్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లుగా ఆర్డీవో ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. త్వరలోనే మేయర్ ఎన్నికకు తేది ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. పీర్జాదిగూడ మునిసిపల్ కార్పొరేషన్‌లో ఇప్పటి వరకు కొనసాగిన అరాచక పాలనకు తెరపడిందని అన్నారు. కాంగ్రెస్‌కు చెందిన 12వ డివిజన్ కార్పొరేటర్ అమర్‌సింగ్‌ను తమ మేయర్ అభ్యర్థిగా ప్రకటించారు.

పూడికతీతతో పూర్వస్థితి

ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడిక తీయాలి

- వచ్చే ఇసుకతో ప్రభుత్వానికి ఆదాయం
- మట్టిని రైతులకు ఉచితంగా ఇవ్వాలి
- 14లోగా ప్రతిపాదనలు అందించాలి
- మంత్రివర్గ ఉపసంఘం ఆదేశం


ప్రాజెక్టుల్లో పూడికతీతపై సచివాలయంలో సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టులకు నష్టం వాటిల్లకుండా పూడికతీత పనులు చేపట్టాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని మంత్రివర్గ ఉపసంఘం అధికారులను ఆదేశించింది. ప్రాజెక్టుల రక్షణలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీ ఉండరాదని స్పష్టం చేసింది. ప్రాజెక్టులకు ఏటా వచ్చే భారీ వరదతోపాటు పూడిక కూడా వచ్చి చేరుతోందని తెలిపింది. దీంతో ప్రాజెక్టుల సామర్థ్యం తగ్గుతున్నందున.. పూడికతీతతో పూర్వస్థితిని పునరుద్ధరించాలని సూచించింది. శుక్రవారం సచివాలయంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఉపసంఘం సమావేశం జరిగింది. పూడికతీతకు ఏయే చర్యలు తీసుకోవచ్చనే దానిపై నీటిపారుదల, మైనింగ్ శాఖలు సమగ్ర నివేదిక రూపొందించి, 14లోగా అందించాలని మంత్రివర్గం ఆదేశించింది. పూడిక వల్ల డ్యామ్ సేఫ్టీ సమస్యలు తలెత్తడంతో పాటు ఆయకట్టు తగ్గిపోతోందని, తాగునీటి అవసరాలపైనా దీని ప్రభావం పడుతుందని మంత్రులు పేర్కొన్నారు. ప్రాజెక్టుల్లో పూడికతీతకు పర్యావరణ అనుమతి అవసరంలేదని కేంద్రం చెప్పినందున..దానికనుగుణంగా చర్యలు చేపట్టాలన్నారు. పూడికలో ఇసుక ఉంటే నిర్మాణ అవసరాలకు వినియోగించుకోవాలని, సారవంతమైన మట్టి ఉంటే రైతాంగానికి ఉచితంగా అందించాలని సూచించారు. పూడికను రైతులే స్వయంగా తీసుకెళ్లేలా విధివిధానాలు రూపొందించాలని ఆదేశించారు.

35 టీఎంసీల నిల్వను కోల్పోయాయి!

మహారాష్ట్ర, రాజస్థాన్‌లో వాణిజ్య అవసరాలకు ప్రయోగాత్మకంగా కొన్ని ప్రాజెక్టుల్లోని పూడికను వినియోగించుకుంటున్నారని అధికారులు మంత్రివర్గ ఉపసంఘానికి తెలిపారు. యంత్రాల సహాయంతో డ్రెడ్జింగ్ చేస్తూ పూడిక తీస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు (ఎన్‌హెచ్‌పీ) కింద 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్లు 35 టీఎంసీల నిల్వను కోల్పోయినట్లు తేలిందని నివేదించారు. ఏటా పూడిక తీతకు టెండర్లు పిలిచి ప్రైవేటు కాంట్రాక్టర్లకు అప్పగిస్తే.. ఇసుక తరలింపుతో ట్యాక్స్, సెస్, జీఎస్టీ, ఇతర రాయల్టీలతో ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని అన్నారు. పూడిక వల్ల జలాశయాలు ఏటా 0-5 శాతం నిల్వలను కోల్పోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 25 ఏళ్లకు పైగా నిండిన జలాశయాలున్నాయని, ప్రయోగాత్మకంగా కొన్నింట్లో పూడికతీత చేపట్టి.. ఆ తరువాత మొత్తం 159 జలాశయాల్లో అమలు చేస్తే ప్రయోజనం ఉంటుందని వివరించారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్‌దాస్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ప్రాజెక్టులను మింగుతున్న పూడిక

ఏటా వరదల సమయంలో జలాశయాల్లోకి నీటితోపాటు పూడిక వచ్చిచేరుతుండడంతో ప్రాజెక్టుల సామర్థ్యం ఏయేటికాయేడు తగ్గిపోతోంది. ఈ పూడిక.. ప్రాజెక్టుల ఆయుష్షును కూడా తగ్గిస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని నిజాంసాగర్‌ను 1923లో అప్పటి నిజాం ప్రభుత్వం నిర్మించగా... ఈ ప్రాజెక్టు 1967 నాటికే 52.10 శాతం సామర్థ్యం కోల్పోయింది. అప్పట్లో నిజాంసాగర్‌కు ఎగువన ప్రాజెక్టులే లేకపోవడంతో వచ్చే వరద పూడికతో సహా జలాశయంలో చేరడంతో ప్రాజెక్టు సామర్థ్యం సగానికి పైగా తగ్గింది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 2016లో నిర్మించిన ర్యాలివాగు సామర్థ్యం 43.30 శాతం మేర తగ్గింది. శ్రీశైలం ప్రాజెక్టు 1976లో అందుబాటులోకి రాగా... 45 ఏళ్లలో పూడిక కారణంగా 29.96 శాతం మేర నీటినిల్వ సామర్థ్యం కోల్పోయింది. ఇక నాగార్జునసాగర్ 23.52 శాతం నిల్వ సామర్థ్యం తగ్గింది. మొత్తంగా రాష్ట్రంలో 929 టీఎంసీల సామర్థ్యం కలిగిన 159 భారీ రిజర్వాయర్లు ఉండగా.. 220 టీఎంసీల సామర్థ్యం కలిగిన 14 ప్రాజెక్టుల్లో పూడికపై అధ్యయనం చేయించారు. ఇందులో ఈ ప్రాజెక్టుల సామర్థ్యం 35 టీఎంసీల మేర కోల్పోయిందని గుర్తించారు. ప్రాజెక్టుల్లో పూడిక చేరకుండా చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, నదీ తీర ప్రాంతాలు కోతకు గురికాకుండా మొక్కల పెంపకం వంటి చర్యలు తీసుకోవాలని అంతర్జాతీయ నిపుణులు సూచిస్తున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టకపోవడంతో వాటిని పూడిక మింగుతోంది. ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) మార్గదర్శకాల ప్రకారం ఒక టీఎంసీ సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నిర్మించాలంటే భూసేకరణ, నిర్మాణ ఖర్చులు కలిపి రూ.162 కోట్లు అవుతాయని లెక్క ఉంది. ఈ లెక్కన రాష్ట్రంలో ఎన్‌హెచ్‌పీ కింద అధ్యయనం చేసిన జలాశయాలు రూ.5670 కోట్ల మేర నష్టపోయాయి.

నిర్మల్ వాసి ఆడు జీవితం

- సౌదీలో ఒంటెల కాపరిగా నామ్‌దేవ్
- రక్షించాలంటూ సెల్ఫీ వీడియో
- టీజీఎండీసీ ఛైర్మన్ అనిల్ ట్వీట్‌తో భారత ఎంబసీ స్పందన
- నామ్‌దేవ్ ఆచూకీ గుర్తించిన అధికారులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

దళారుల మాటలు నమ్మి భారత్ నుంచి సౌదీ అరేబియా వెళ్లి ఎడారిలో ఒంటెల కాపరిగా పని చేసే ఓ వ్యక్తి దుర్భర జీవితం ఇతివృత్తంగా ఇటీవల ఆడు జీవితం అనే సినిమా వచ్చింది. తెలంగాణలోని నిర్మల్ జిల్లాకు చెందిన రాథోడ్ నామ్‌దేవ్(51) అనే వ్యక్తి ఆ సినిమాలో మాదిరిగా సౌదీ ఎడారిలో దుర్భర జీవితం గడుపుతున్నాడు. ఈ కష్టాల నుంచి రక్షించండి అని వేడుకుంటూ నామ్‌దేవ్ ఇటీవల సోషల్ మీడియాలో సెల్ఫీ వీడియో పెట్టడంతో ఈ విషయం బయటికొచ్చింది. నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు స్పందన రావడంతో అతను స్వదేశానికి వచ్చే అవకాశం కనిపిస్తోంది. నిర్మల్ జిల్లా ముథోల్ మండలం రువ్వి గ్రామానికి చెందిన రాథోడ్ నామ్‌దేవ్ పెట్టిన వీడియోకు తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ(టీజీఎండీసీ) ఛైర్మన్ ఈరవత్రి అనిల్ స్పందించారు. నామ్‌దేవ్‌ను సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రి, కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులను ఎక్స్(ట్విటర్) ద్వారా కోరారు. దీంతో కువైత్‌లోని భారత ఎంబసీ అధికారులు నామ్‌దేవ్‌ను సంప్రదించారు. కువైత్ సరిహద్దులోని సౌదీ అరేబియా ఎడారిలో నామ్‌దేవ్ ఉన్నట్టు గుర్తించారు. చాలా కాలంగా గల్ఫ్‌లో ఉంటున్న నామ్‌దేవ్‌ను అతని యజమాని పది నెలల క్రితం సౌదీలోని ఒంటెల క్షేత్రానికి తరలించినట్టు తెలిసింది. కాగా, సౌదీ, కువైత్‌లోని ప్రవాసీయులు నామ్‌దేవ్‌ను సంప్రదించేందుకు యత్నించగా అతని ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. నామ్ దేవ్‌ను ఏ విధంగా స్వదేశానికి పంపిస్తారో తెలియాల్సి ఉంది.

20 నుంచి బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆగస్టు 20 నుంచి కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ రెండో సెమిస్టర్ 2023-24 ఏడాది రెగ్యులర్ కోర్సు పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బి.నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల పరీక్షల జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూమెంట్ అభ్యర్థుల పరీక్షలకు హాజరుకావాలని తెలిపారు. వివరాలకు https:// kakatiya.ac.in కేయూ వెబ్‌సైట్ చూడలని సూచించారు.

13న జాబ్ మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ములుగురోడ్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈ నెల 13న జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సీహెచ్.ఉమారాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్‌లోని ఇండస్ట్రియల్ డిటెక్టివ్ సెక్యూరిటీ సర్వీసెస్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్లు, సెక్యూరిటీ గార్డ్స్ జాబ్స్ కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. పదో తరగతి, ఆపై క్వాలిఫికేషన్స్ ఉన్న 20 నుంచి 40 యేళ్లలోపు వయస్సు ఉన్న యువకులు జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈ నెల 13న ఉదయం 11 గంటలకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9573885532 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏజీపీగా సోమయ్య ఏజ్రా శాస్త్రీ నియామకం



హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా హైకోర్టు న్యాయవాది హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. హనుమకొండ లష్కర్‌సింగారానికి చెందిన హన్మకొండ సోమయ్య ఎజ్రా శాస్త్రీ ఆదర్శలా కాలేజీలో ఎల్ఎల్‌బీ చేసి 2018లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. అనంతరం హైకోర్టులో సీనియర్ న్యాయవాది పడాల ప్రవీణ్ కుమార్ దగ్గర ప్రాక్టీసు మొదలుపెట్టారు. రంగారెడ్డి జిల్లా కోర్టులో కొంత కాలం న్యాయవాదిగా ప్రాక్టీసు చేశారు. అనంతరం హైకోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీసు కొనసాగించారు. చిన్న వయసులోనే ఏజీపీగా నియమితులు కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్నేహితులు హర్షం వ్యక్తం చేశారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, ఆగస్టు 9: కాజీపేట సిద్ధార్థనగర్‌లోని డి.అమర్‌నాథ్ అనే వ్యక్తి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. రూ.29వేల నగదు స్వాధీనం చేసుకుని ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఐదుగురిని విచారణ నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ ధ్రువీకరించారు.

గంజాయి కోసం చైన్‌స్నాచింగ్

జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు ● నలుగురు నిందితుల అరెస్టు
బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనం స్వాధీనం ● సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా


వివరాలను వెల్లడిస్తున్న సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా

మట్టెవాడ, ఆగస్టు 9: గంజాయి, జల్సాల కోసం ముఠాగా ఏర్పడి నేరాలు, చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నలుగు రు నిందితులను అరెస్టు చేసినట్లు సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా తెలిపారు. శుక్రవారం వరంగల్ మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ.. జూలై 30న మట్టెవాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తవాడకు చెందిన వడ్లకొండ వనజ మెడలోని బంగారు చైన్‌ను భూపాలపల్లికి చెందిన బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు లాక్కొని స్కూటీపై భూపాలపల్లికి పరారైనట్టు తెలిపారు. అనిల్, బాసిత్‌లకు వరంగల్ ములుగు రోడ్డు వద్ద ప్రైవేట్ హాస్టల్‌లో షెల్టర్ ఇచ్చిన భూపాలపల్లి జిల్లా పలిమెల మండలానికి చెందిన మహ్మద్ షోయబ్‌ఖాన్, చైన్‌స్నాచింగ్‌కు ప్లాన్ వేసిన భూపాలపల్లి రాజీవ్ నగర్‌కు చెందిన మహ్మద్ ఫారూక్‌ఖాన్‌లను శుక్రవారం ములుగురోడ్డు వద్ద పక్కా సమాచారంతో ఆదుపులోకి తీసు కున్నట్టు వెల్లడించారు. వారిని విచారించగా చైన్‌స్నాచింగ్‌కు పాల్పడినట్టు ఒప్పుకున్నట్లు తెలిపారు. దాంతో వారి నుంచి రెండు తులాల బంగారు పుస్తెల తాడు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీన పరుచుకున్నట్లు డీసీపీ వెల్లడించారు.

నిందితులు గతంలో భూపాలపల్లి, వైజాగ్, పరకాల, ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో పలు నేరాలకు పాల్పడ్డరన్నారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దే శంతో ముఠాగా ఏర్పడి చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్నట్టు పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించి వరంగల్ కొత్తవాడలో మహిళ మెడలోంచి చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డరని తెలిపారు. నిందితులు ఫారూక్‌ఖాన్, మహ్మద్ బాసిత్‌లు గంజాయి స్మగ్లింగ్ చేయడం, గంజాయి సేవించడం బొల్ల అనిల్, మహ్మద్ బాసిత్‌లు ద్విచక్ర వాహనాలు దొంగతనాలకు పాల్పడిన కేసులలో నిందితులని అనిల్ పరకాల పోలీస్ స్టేషన్ పరిధి చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడని తెలిపారు. వైజాగ్ పరిధిలో గంజాయి కేసులో నిందితుడని డీసీపీ వివరించారు.

చైన్ స్నాచింగ్ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనపరిచిన మట్టెవాడ సీఐ తుమ్మ గోపి, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ అబ్బయ్య, భూపాలపల్లి డీఐ నరేశ్, మట్టెవాడ ఎస్సై విఠల్, సీసీఎస్ ఎస్సై సంపత్, పోలీస్ కానిస్టేబుళ్ళు హరికాంత్, మహ్మద్ అలీ, విజయ్‌కాంత్, మధుసూదన్, తిరుపతయ్య, రాజేందర్ ప్రసాద్, హోంగార్డు నాగేశ్వర్‌రావులను డీసీపీ షేక్ సలీమా, వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్‌లు అభినందించారు. కార్యక్రమంలో ఏసీపీ నందిరాం నాయక్, ఇన్‌స్పెక్టర్ గోపి, అబ్బయ్య, పాల్గొన్నారు.

ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలి

● కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ● కేయూలో ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం


కేయూలో రిజిస్ట్రార్ మల్లారెడ్డితో ఆదివాసీ ప్రొఫెసర్లు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ సంబురాలు నిర్వహించారు. కేయూ మొదటి గేటు నుంచి అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్ వరకు ఆదివాసీ కల్చరల్ ర్యాలీ, పతాకావిష్కరణ , జ్యోతి ప్రజ్వలన, సాంస్కృతిక సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సంపన్నమైనది ఆదివాసీ సంస్కృతి అని చెప్పారు. సంస్కృతి పుట్టింది ఆదివాసీల నుంచే అని చెప్పారు. వర్సిటీ పరిధిలో 50 ఆదివాసీ ప్రాంతాలున్నాయని చెప్పారు. వర్సిటీ ఆదివాసీ విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని చెప్పారు. ఆదివాసీ విద్యార్థులు పరిశోధనలపై దృష్టి సారించాలని అన్నారు. వ్యవసాయమే కాకుండా ఇతర రంగాల్లో ప్రవేశించి నిపుణులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

విశిష్ట అతిథిగా హాజరైన ములుగు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎ.భిక్షపతిరావు మాట్లాడుతూ.. ఆదివాసీలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. మన పూర్వీకులు సంప్రదాయ పద్ధతులతో వ్యాధులు, రోగాల నివారణ చేశారని అన్నారు. ఆదివాసీలు విద్యపైన దృష్టి సారించాలని అన్నారు. చదువుకున్న ప్రతీ ఒక్క ఆదివాసీ తోటివారిలో విద్యపై అవగాహన కల్పించి వారిని అభివృద్ధి పథంలోకి తీసుకుని రావాలని పిలుపునిచ్చారు. రిటైర్డు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సారయ్య దొర మాట్లాడుతూ.. ఆదివాసీలు మూలాలను మరవద్దని అన్నారు. శాస్త్రీయమైంది ఆదివాసీల గోత్ర వ్యవస్థ అని చెప్పారు. భావాలు, ఉద్దేశాలు మంచిగా ఉండాలని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ ఈసం నారాయణ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా 90దేశాల్లో ఆదివాసీలున్నాయని చెప్పారు. 30 ఏళ్లుగా ఆదివాసీలు అనేక సాంస్కృతిక పరిరక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆదివాసీల్లో అవగాహన రావాలన్నారు. ఆదివాసీల అభివృద్ధికి నిధుల కేటాయింపు పెరగాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆదివాసీ యువత సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ వాసం ఆనంద్ కుమార్, రవి, కుమారస్వామి, రాజేశ్, సురేందర్, సాయి, తాటి అనిల్, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.

దేవాదాయ శాఖలో బదిలీలు

6బి కేటగిరీలో ఆలయాల్లో ఇద్దరు ● 6ఏ కేటగిరీ గుడుల్లో ఆరుగురు

హనుమకొండ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ శాఖలో ఉమ్మడి జిల్లా పరిధిలో జరిగిన బదిలీల్లో మొత్తం 8మంది ఉద్యోగులకు స్థాన చలనం జరిగింది. దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6బీ కెటగిరీకి వచ్చే దేవాలయాల నుంచి ఇద్దరు, రీజినల్ జాయింట్ కమిషనర్ పరిధిలోకి వచ్చే 6ఏ దేవాలయాల్లో ఆరుగురికి బదిలీలు జరిగాయి. 6బి కేటగిరీ కింద వరంగల్‌లోని కట్టమల్లన్న దేవాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న మహిపాల్ వరంగల్ ఉర్సు ప్రాంతంలోని నాగేశ్వరాలయానికి, అక్కడ పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్ శ్యాంసుందర్ కట్టమల్లన్న గుడికి బదిలీ అయ్యారు. నాగేశ్వరాలయంలో పనిచేస్తున్న కార్యనిర్వహణాధికారి (ఈవో) కమల రిటైరయ్యారు. ఆమె స్థానంలో వరంగల్ దుర్గేశ్వరాలయం ఈవో ప్రసాద్‌ను నాగేశ్వరాలయం ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు అప్పగించారు. కాగా 6ఏ కేటగిరి కింది వేయిస్తంభాలగుడిలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ ప్రేమ్‌కుమార్ ఐనవోలుకు బదిలీ అయ్యారు. ఐనవోలు ఆలయంలో పనిచేసే .జూనియర్ అసిస్టెంట్ మధుకర్ వేయిస్తంబాలగుడికి వచ్చారు. కొత్తకొండ ఆలయంలో పనిచేసే సంజీవరావు ఐనవోలుకు బదిలీ అయ్యారు. అక్కడ పనిచేసిన నారాయణ కొత్తకొండకు వచ్చారు. వరంగల్ బట్టలబజార్‌లోని రామిలింగేశ్వరాలయం ఈవో వెంకట్రావు హసన్‌పర్తిలోని ఎర్రగట్టు వెంకటేశ్వరాలయానికి, అక్కడ ఈవోగా పనిచేస్తున్న కిషన్‌రావు వరంగల్ స్టేషన్ రోడ్డులోని కాశీవిశ్వేరాలయానికి స్థాన చలనం జరిగింది.


ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 12న స్పాట్ అడ్మిషన్ల క్యాంపు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బైరి ప్రభాకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలీసెట్-2024లో అర్హత సాధించిన విద్యార్థులతో పాటు అర్హత సాధించని విద్యార్థులు సైతం ఈ నెల 11 వరకు దరఖాస్తు చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. మెకానికల్ ఇంజనీరింగ్‌లో ఖాళీగా ఉన్న 7 సీట్ల కోసం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ ఉండదని ఆయన స్పష్టం చేశారు. స్పాట్‌కు హాజరయ్యే విద్యార్థులు వారి ఒరిజినల్, జీరాక్స్ సెట్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

వర్సిటీ అనుమతిలేని కళాశాలల్లో చేరొద్దు

కేయూ క్యాంపస్, ఆగస్టు 9: కాకతీయ యూనివర్సిటీ అనుమతి లేకుండా నడుస్తున్న కళాశాలల్లో విద్యార్థులు అడ్మిషన్ల పొందవద్దని రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో విద్యార్థులకు సూచించారు. వర్సిటీ పరిధిలోని డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్న విద్యార్థులు కళాశాల అఫ్లియేషన్‌ను చూసుకోవాలని, ఆయా వివరాలు వర్సిటీ డీన్, కాలేజీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కార్యాలయంలోనూ అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కళాశాలలు పేరు, అడ్రస్, మేనేజ్‌మెంట్ మార్చుకుని వర్సిటీ అనుబంధం ఉన్నట్లు తప్పుడు సమాచారంతో కొన్ని కళాశాలలు అడ్మిషన్లు చేసుకున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. తప్పుడు కళాశాలల్లో చేరిన విద్యార్థులకు వర్సిటీకి ఎలాంటి సంబంధం ఉండదని హెచ్చరించారు.

బయోటెక్నాలజీలో ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్



కేయూ క్యాంపస్, ఆగస్టు 9: రంగారెడ్డి జిల్లా మెయినాబాద్ చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ బయోటెక్నాలజీ విభాగం పరిశోధకుడు ప్రసన్నకుమా ర్ టీపీ డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు శుక్రవారం చైతన్య డీమ్డ్ వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ ఎం.జగదీశ్వర్ ప్రసన్నకుమార్‌కు డాక్టరేట్ ప్రకటించినట్లు తెలిపారు. 'మైక్రోబియల్ ప్రొఫైలింగ్ ఆఫ్ జీవామృతం అండ్ ఆప్టిమైజేషన్ స్టడీస్ ఆఫ్ ఫర్మెంటేషన్ పారామీటర్స్ ఫర్ ది మాస్ ప్రొడక్షన్ ఆఫ్ బయోఫర్టిలైజర్' అనే అంశంపై చైతన్య టూబీ డీమ్డ్ వర్సిటీ బయోటెక్నాలజీ ప్రొఫెసర్ మురళీకృష్ణ పర్యవేక్షణలో ప్రసన్నకుమార్ పరిశోధన పూర్తి చేశారు. ప్రసన్నకుమార్ టీపీ అంతర్జాతీయ, జాతీయ సదస్సులలో పరిశోధన పత్రాలు సమర్పించారు. డాక్టరేట్ సాధించిన ప్రసన్నకుమార్ వీసీలు డాక్టర్ సీ.హెచ్.వి పురుషోత్తమ్ రెడ్డి, ప్రొఫెసర్ జి.దామోదర్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి, రీసర్చ్ డీన్ ప్రొఫెసర్ టి.క్రిష్టోఫర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రవీందర్‌తో పాటు పలువురు అభినందించారు.

పోడు భూముల హక్కు కోసం గిరిజనులు పోరాడాలి

గిర్మాజీపేట, ఆగస్టు 9: జల్, జంగల్, జమీన్లను రక్షిస్తు వాటిని సాధించు కునేందుకు, పోడు భూముల హక్కుకు నిర్మాణాత్మక ఉద్యమాలు చేపట్టాలని ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి పిలుపునిచ్చారు. శుక్రవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సమీపంలో ఎంసీపీఐ(యు) జిల్లా కార్యాలయం ఓంకార్ భవన్‌లో సుంచు జగదీశ్వర్ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో రవి మాట్లాడుతూ భూమి,ప్రకృతి,గాలి,నీరు పరిరక్షించు కోవడమే ప్రపంచ ఆదివాసీ దినోత్సవమనే విషయాన్ని ప్రపంచం గుర్తించి ఆ మేరకు కృషిచేయాలని. సమావేశంలో ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యులు మట్టయ్య, కుమారస్వామి, జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్, సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, రాష్ట్ర నాయకులు కుసుంబ బాబురావు, కొమురయ్య,జిల్లా నాయకులు ఇస్మాయిల్, ప్రభాకర్, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

ఘనంగా నాగుల పంచమి వేడుకలు



ఊకల్ నాగేంద్రస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు



దయానంద కాలనీలో మహిళల పూజలు



ఓసిటీ నాగేంద్రస్వామి ఆలయంలో..



నాగమయ్య గుడిలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

శంభునిపేట, ఆగస్టు 9 : కొంగు బంగారమై విరాజిల్లుతున్న ఉర్సు నాగేశ్వరస్వామిని దర్శించుకోవటానికి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. నాగుల పంచమి సందర్భంగా నగరంలోని 41వ డివిజన్ ఉర్సు నాగమయ్య ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన పూజారులు జాగర్లపూడి శ్రీరామశర్మ, హరీష్ శర్మల ఆధ్వర్యంలో అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. వల్లీసమేత సుబ్రహ్మణ్యేశ్వర నాగేశ్వర స్వామిలను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు రావడంతో క్యూలైన్‌లు నిండిపోయాయి. పుట్టలో పాలు పోసి చల్లగా కాపాడాలంటూ వేడుకున్నారు. మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒడిస్సా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి నాగేశ్వరస్వామిని దర్శించుకోవటానికి భక్తులు తరలివచ్చారు. మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకల్లో ఆలయ ఈవో ప్రసాద్, ప్రత్యేక అధికారిని కమల, ఆలయ ఫౌండర్ ట్రస్టు చైర్మన్ తోట నర్సయ్యలింగం, కార్పొరేటర్‌లు పోశాల పద్మస్వామి, గుండు చందనపూర్ణచందర్ పాల్గొన్నారు.

● రంగశాయిపేట మహంకాళీ ఆలయంలో నాగుల పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులు ఆలయ ప్రాంగణంలోని నాగేశ్వరస్వామికి పాలతో అభిషేకించారు.

● గీసుగొండ: ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నాగుల పంచమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి నాగేంద్రుడిని దర్శించుకొని వల్మికంలో పాలు పోసి వెండికన్ను, పైడికన్ను సమర్పించారు. 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రాంరెడ్డి, అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి సతీమణి సునంద, సీఐ బాబులాల్, డీపీఆర్‌వో పల్లవి తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, కమిటీ అధ్యక్షుడు మాచినపెల్లి బాబురావు, కోశాధికారి కొత్తగట్టు రాజేందర్, మాజీ సర్పంచ్‌లు మొగసాని నాగదేవత, కేలోతు సరోజన, మాజీ ఎంపీటీసీ వీరారావు, శ్రీరాముల రమేష్, అభిషేక్, అశోక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు నాగరాజు, సుభాష్ పాల్గొన్నారు.

● వరంగల్ సిటీ: దయానందకాలనీ కనకదుర్గా మాతా దేవాలయ ఆవరణలోని శ్రీ నాగేంద్రస్వామి ఆలయంలో శ్రావణమాస శుక్రవారం నాగుల పంచమి సందర్భాన్ని పురస్కరించుకుని ఆ ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. భక్తులు పుట్టలోపాలు పోసి, పూలు, పండ్లు, పసుపు కుంకుమ వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

● నగరంలోని 19వ డివిజన్ ఓసిటీ శ్రీ రేణుక ఎల్లమ శ్రీ నాగేంద్రస్వామి దేవాలయంలో ఆ ఆలయ కమిటీ అధ్యక్షురాలు బలభద్ర కళావతి ఆధ్వర్యంలో పంచమి వేడుకలు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పుట్టలోపాలు మొక్కులు సమర్పించుకున్నారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత



మహా మండపాన్ని ప్రారంభిస్తున్న రఘుపతిరావు

గీసుగొండ, ఆగస్టు 9: దైవచింతనతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వస్తా యని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు అన్నారు. భక్తుల ఆర్థిక సహ కారంతో నాగసు బ్రహ్మణ్యే శ్వర స్వామి ఆలయంలో నిర్మిం చిన మహా మండపా న్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆలయాలు దోహదం చేస్తాయని, ప్రతీ గ్రామంలో గుడి, బడి ఉండాలని వేదపండితులు చెప్పారన్నారు. నాగేంద్రస్వామి ఆలయంలో మహా మండప ఏర్పాటుకు సహకరించిన కమిటీ చైర్మన్, దాతలకు, భక్తులకు ఆయన అభినందించారు. నియమ నిష్ఠలతో, పట్టు దలతో మండప నిర్మాణం పూర్తి చేసిన ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షను ఘనంగా సత్కరించారు. అనంతరం రఘుపతిరావు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కోశాధికారి రాజేందర్, మాజీ ఎంపీటీసీ వీరారావు, శ్రీరాములు రమేష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: రేవూరి



మొక్క నాటుతున్న రేవూరిప్రకాష్‌రెడ్డి

గీసుగొండ, ఆగస్టు 9: పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యతని ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. వ న మ హోత్సవ ంలో భాగంగా 15వ డివిజన్ రెడ్డిపా లెంలో మేయర్ సుధారాణి, కలెక్టర్ సత్యశా రదతో కలిసి శుక్రవారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలతోనే మానవాళి మనుగడ ఆధారపడి ఉందన్నారు. మొక్కలను విరివిగా నాటి వాటిని రక్షించే బాధ్యతను తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఫారెస్ట్ అధికారి అనూజ్ అగర్వాల్, నాయకులు కొండేటి కొమురారెడ్డి, దూపాకి సంతోష్‌కుమార్, ఎలగొండ ప్రవీణ్, ఎన్‌సీసీ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ అనుబంధ మోర్చా కమిటీలకు జిల్లా అధ్యక్షుల నియామకం

మిల్స్‌కాలనీ, ఆగస్టు 9: వరంగల్ జిల్లా భారతీయ జనతా పార్టీకి చెందిన వివిధ మోర్చాల కమిటీలకు అధ్యక్షులను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా సంస్థాగత నిర్మాణంలో భాగంగా ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా పోలెపాక మార్టిన్ లూథర్, మైనారిటీ మోర్చా అధ్యక్షుడిగా సర్దార్ గోవింద్ సింగ్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కాసు శిల్ప, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా బైరి నాగరాజు, ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా బానోతు వీరన్నను నియమిం చినట్లు తెలిపారు.

రైతు, కార్మిక సంఘాల ధర్నా



హెడ్‌పోస్టాసెంటర్‌లో రైతు,కార్మిక సంఘాల ధర్నా

గిర్మాజీపేట, ఆగస్టు 9 : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానా లను నిరసి స్తూ సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సం ఘాల జాతీయ సమ న్వయ కమిటీ పిలుపు మేరకు శుక్రవారం వర ంగల్ హెడ్ పోస్టాఫీసు సెంటర్ రైతు,కార్మిక సం ఘాలు ధర్నా నిర్వహించాయి. కార్మిక సంఘం నాయకుడు గంగుల దయాకర్ అధ్యక్షతన జరిగిన ధర్నాలో సంయుక్తి కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ పెద్దారపు రమేష్, కార్మిక, రైతు సంఘాల నాయకులు సోమిడి శ్రీనివాస్, రాచర్ల బాలరాజులు కేంద్ర ప్రభుత్వ రైతు,కార్మిక వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి మోడి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ రంగానికి అప్పగిస్తు వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలో పెడుతున్నదని ఆరోపించారు. క్విట్ ఇండియా స్ఫూర్తిగా మోదీ ప్రభుత్వ రైతు,కార్మిక వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని రైతులు, కార్మికులకు పిలుపునిచ్చారు. ధర్నాలో రైతు, కార్మిక సంఘాల నాయకులు జి.రమేష్, ఎం.రామస్వామి, ఎన్.ప్రతాప్, జి.కుమా రస్వామి, సాగర్, కృష్ణ, బాబు రావు, ఐలయ్య, ఎం.డి.ఇస్మాయిల్, రవియాదవ్, ఇనుముల శ్రీను, ఓదెల రాజయ్య, దామెర కృష్ణ, రాజనర్సయ్య, ఎండి.యాకుబ్, బరపటి రవిందర్ పాల్గొన్నారు.

కూతురు సహా జర్నలిస్టు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ఇంటినుంచి కూతురిని తీసుకెళ్లిన యోగిరెడ్డి సాయంత్రానికి కూడా ఇంటికి రాకపోవడం, పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య స్వప్న ఆఫీసు వద్దకు వెళ్లి చూడగా కూతురు సహా యోగిరెడ్డి ఉరేసుకుని కనిపించడంతో ఆమె నిర్ఘాంతపోయారు. ఇద్దరినీ అలా చూసిన ఆమె కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

జర్నలిస్టుల సంతాపం..

యువజర్నలిస్టు యోగిరెడ్డి కూతురుతో కలిసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో తోటి జర్నలిస్టులు విషాదంలో మునిగిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న కొందరు జర్నలిస్టులు కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు యోగిరెడ్డి కుటుంబసభ్యులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతం



రాజరాజేశ్వరి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9: వరాలనిచ్చే వరలక్ష్మి, సౌభాగ్యా నిచ్చే సంతాన లక్ష్మి, ధాన్యానిచ్చే ధనలక్ష్మి.. మమ్ములను కరుణించూ అంటూ మహిళలు శ్రావణ శుక్రవారం వేళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల సామూ హిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిం చారు. దీంతో నగరంలోని ఆలయా లు భక్తులతో కిటకిటలా డాయి. పూజలు, వ్రతాలు, పారాయణాలు, అన్నదానాలతో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. భద్రకాళి దేవాలయం భక్తులతో పోటెత్తింది. హంటర్‌రోడ్డులోని శ్రీసంతోషిమాత అమ్మవారిని పెద్దసంఖ్యలో మహిళా భక్తులు దర్శించుకున్నారు. శ్రీరాజరాజేశ్వరి దేవాలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించుకున్నారు. శృంగేరి శంకర మఠంలో శారదామాతకు అభిషేకం, అలంకరణలు నిర్వహించారు. జగద్గురు విధుశేఖర భారతి స్వామి వర్ధంతి పూజ, గురుపాదుకా పూజలు నిర్వహించారు. దత్తక్షేత్రంలో మహా లక్ష్మి అమ్మవారికి విశేష అభిషేకం, జయలక్ష్మి మాతకు కుంకుమ పూజలు, లలితా పారాయణం, మణిద్వీప వర్ణన పూజ నిర్వహించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో కలశాభిషేకం, భజనలు నిర్వహించారు. పోచమ్మ దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి.

భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భద్రకాళి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9: శ్రావణ మాసం మొదటి శుక్రవారం భద్రకాళి అమ్మ వారి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఉద యం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారం భమైన అమ్మవారి పూజ నిత్యాహ్ని కం అనంత రం అమ్మవారి అలంకర ణ, హారతి నివేదన జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా సర్వదర్శనానికి ప్రత్యేక రుసుంతో కూడిన టికెట్ తీసుకొని భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మ వారికి ఒడి బియ్యం, చీరలను భక్తులు సమర్పించారు. భక్తుల సందడి పెరగడంతో ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దేవాలయ సిబ్బంది దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.

- ప్రత్యేక ప్రసాద కౌంటర్లతో ఇక్కట్లు..

అమ్మవారి దర్శనానికి వచ్చే దారిలోనే ప్రసాద కౌంటర్లు ఏర్పాటు చేయడం భక్తులకు తీవ్ర ఇబ్బంది కలిగించింది. భద్రకాళి అమ్మవారి ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తున్న నేపథ్యంలో ప్రసాదాల విక్రయాల బాధ్యతను బ్యాంకర్ల ద్వారా నిర్వహించాలని భక్తులు కోరుతున్నారు. ఆలయానికి వచ్చే దారిలోనే వాహనాలు నిలపడం, రోడ్డుకు ఇరువైపులా బొమ్మల దుకాణాలు, పూజా సామగ్రి, స్వీట్ విక్రయాలు ఏర్పాటు చేయడంతో భక్తుల తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రధాన ద్వారం లోపలికి వాహనాల అనుమతి లేకున్నా ఇష్టారాజ్యంగా పార్కింగ్‌పై భక్తులు మండిపడ్డారు.

అమ్మవారి ఆదాయం రూ.4.40లక్షలు

భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శ్రావణ శుక్రవారం ఒక్కరోజు ఆదాయం హుండి, ప్రసాదాలు, పూజ టిక్కెట్లు, వాహనాలపూజ టిక్కెట ద్వారా రూ.4.40లక్షలు ఒక్కరోజే లభించింది. దేవాలయ చరిత్రలో ఒక్కరోజు హుండీ ఆదాయం రావడం రికార్డ్ అని ఈవో శేషు భారతి తెలిపారు.

ఘనంగా ఆయుర్వేద వైద్య పితామహుడు చరక జయంతి

గిర్మాజీపేట, ఆగస్టు 9: భారతీయ ఆయుర్వేద వైద్య పితామహుడు చరక ఆచార్యుడని, మానవ శరీరం వాత, పిత్త, కఫా దోషాల ఆధారంగా ఉంటుందని చెప్పిన మహనీయుడని వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాల డాక్టర్ అనసూయ అన్నారు. శుక్రవారం ఆయుర్వేద వైద్య పితామహుడు చరక జయంతి, ఆప్రాన్ డే వరంగల్ అనంతలక్ష్మి ప్రభుత్వ ఆయుర్వేద వైద్య కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈమేరకు ప్రిన్సిపాల్ అనసూయ, కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బి.సాంబమూర్తిలు చరక విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డాక్టర్ అనసూయ మాట్లాడుతూ వాత, పిత్త, కఫా మధ్య సమతుల్యతను పునరుద్ధరించడానికి ఆయర్వేద వైద్యం ఎంతో దోహదం చేస్తుందన్నారు. అనంతరం ఆప్రాన్ డేలో భాగంగా విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఆప్రాన్‌లను అందచేశారు. కార్యక్రమంలో వైద్య కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ అశోక్‌కుమార్, డాక్టర్ ఎస్.శ్రీధర్, డాక్టర్ నాగలక్ష్మి, డాక్టర్ సిరాజుద్దిన్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.శ్రీధర్, అసిస్టెంట్ ప్రొఫెసర్, జాతీయ సేవా పథకం కో ఆర్డినేటర్ డాక్టర్ పి.మహేష్, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ మహేష్ బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు, విశ్వఆయుర్వేద పరిషత్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ ఆయుర్వేద బోధన ఆస్పత్రిలో జరిగిన చరక జయంతి కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ పద్మావతి చరక ఆచార్య చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగన్మోహనాచారి, డాక్టర్ రాజేశ్వరి, ఫార్మసిస్టులు రమేష్ బాబు, భాగ్యలక్ష్మి, శంకర్, దయాకర్ పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులంలో ముగిసిన లయన్స్ క్వెస్ట్ కార్యక్రమం



శిక్షణలో పాల్గొన్న కుందూరు వెంకట్‌రెడ్డి, ప్రిన్స్‌పాల్ జనగామ అంజిరెడ్డి, ఉపాధ్యాయులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఆగస్టు 9 : వరంగల్-ఖమ్మం బైపాస్ రోడ్ ఉర్సుగుట్ట సమీపంలోని ఎంజేపీ గురు కుల పాఠశాల/కళాశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 'లయన్స్ క్వెస్ట్' కార్యక్రమం శుక్రవారంతో ముగి సింది. గురుకుల ప్రిన్సిపాల్ జనగామ అంజిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఎంజేపీ గురుకుల పాఠశాల, కళాశాలల ఉపాధ్యాయులకు లయన్స్ క్వెస్ట్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా 320ఎఫ్ గవర్నర్ కుందూరు వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉపా ధ్యాయులు నేర్చుకున్న విషయాలను విద్యార్థుల ఉన్నతికి ఉపయోగించాలన్నారు. ఆర్సీవో మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు ఉన్నత లక్ష్యంతో చదువాలని సూచించారు. ప్రిన్స్‌పాల్ అంజిరెడ్డి ఆరోగ్య విషయాలపై విద్యార్థినులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. కొండపెల్లి రేణుక ట్రైనర్‌గా వ్యవహరించిన కార్యక్రమంలో 39 గురుకుల పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా 'స్వచ్ఛదనం - పచ్చదనం'



మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ సురేష్‌జోషి

శంభునిపేట, ఆగస్టు 9: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం సామాజిక బాధ్యతని 41వ డివిజన్ కార్పొ రేటర్ పోశాల పద్మ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం డివిజన్‌లోని పలు కాలనీలతోపాటు శంభునిపేట ప్రభుత్వ పాఠశాలలో పిచ్చి మొక్కలను, చెత్తాచెదారాలను తొలగించారు.స్పెషల్ ఆఫీసర్, జవాన్‌లు, మున్సిపల్ సిబ్బంది, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

● పోచమ్మమైదాన్: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని 13వ డివిజన్ కార్పొరేటర్ సురేష్‌జోషి అన్నారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో సీకేఎం కళాశాల నుంచి బాబుజగ్జీవన్‌రాం జంక్షన్ వరకు స్వచ్ఛదనం - పచ్చదనంపై అవగాహన కల్పిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శాని టరీ ఇన్‌స్పెక్టర్ ధరమ్‌సింగ్, కవిత, సాంబరాజు రాజు, వినయ్, డివిజన్ అధ్యక్షుడు బొట్ల ప్రసాద్, విజయ్‌రావు, మేకల బాబు, జన్ను అనిల్‌కుమార్,భాస్కర్ పాల్గొన్నారు.

● సంగెం: గ్రామాల్లో అధికంగా మొక్కలు నాటాలని సంగెం ఎంపీడీవో కాసర్ల రవీందర్ చెప్పారు. శుక్రవారం గవిచర్లలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

● గీసుగొండ: కాకతీయ మెగా టెక్స్‌టైల్‌పార్కులో పోలీసుల ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. మామునూరు ఏసీపీ తిరుపతి ముఖ్యఅతిథిగా హాజర య్యారు. కార్యక్రమంలో సీఐ బాబులాల్, ఎస్ఐ జానీపాషా, టీజీఐఐసీ డీఈ శరత్‌చంద్ర, గణేష్ ఇకోపెట్ కంపెనీ జీఎంహెచ్‌ఆర్ శంకర్ పాల్గొన్నారు.

● ఖిలావరంగల్: ప్రతీ ఒక్కరు ఇంటిచుట్టూ నాలుగు మొక్కలను నాటాలని కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణసురేష్ అన్నారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలలో రాణించిన వారికి మెమోంటోలను అందజేశారు. నగరంలోని 18,34,35,37,38 డివిజన్ శివనగర్, ఖిలావరంగల్ పడమరకోట, తూర్పుకోట, క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీ లలో మొక్కలను నాటి, ప్రజలకు మొక్కలను పంపిణీచేశా రు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వస్కుల బాబు, దిడ్డి కుమారస్వామి, సోమిశెట్టి ప్రవీణ్, వెల్పుగొండ సువర్ణసు రేష్, బైరబోయిన ఉమా-దామోదర్‌యాదవ్‌లతో పాటు టీపీసీసీ కార్యదర్శి కొత్తపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.


చదును చేసిన రోడ్డు

పోచమ్మ రోడ్డుకు మరమ్మతులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

ఖానాపురం, ఆగస్టు 9 : మండల కేంద్రంలోని పోచమ్మగుడికి వెళ్లే రహదారికి శుక్రవారం మరమ్మతులు చేయించి గుంతలను పూడ్చారు. అధ్వానంగా పోచమ్మగుడి దారి అనే కథనం 'ఆంధ్రజ్యోతి'లో శుక్రవా రం ప్రచురితం కాగా, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టా రు. పంచాయతీ కార్యదర్శి సుప్రజ పనులను పర్యవేక్షిస్తూ రోడ్డుపై పడ్డ గుంతలను జేసీబీ సహాయంతో పూడ్చివేయించారు. మట్టి, కంకరతో రోడ్డును చదును చేయించి బురదలేకుండా చేశారు. దీంతో మండల ప్రజలు అధికారుల పనితీరును అభినందించారు.

దైవచింతనతో మానసిక ప్రశాంతత


మహా మండపాన్ని ప్రారంభిస్తున్న రఘుపతిరావు

గీసుగొండ, ఆగస్టు 9: దైవచింతనతో మానసిక ప్రశాంతత, ఏకాగ్రత వస్తాయని 'ఆంధ్రజ్యోతి' వరంగల్ యూనిట్ బ్రాంచ్ మేనేజర్ వి.రఘుపతిరావు అన్నారు. భక్తుల ఆర్థిక సహకారంతో నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నిర్మించిన మహా మండపాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు ఆలయాలు దోహదం చేస్తాయని, ప్రతీ గ్రామంలో గుడి, బడి ఉండాలని వేదపండితులు చెప్పారన్నారు. నాగేంద్రస్వామి ఆలయంలో మహా మండప ఏర్పాటుకు సహకరించిన కమిటీ చైర్మన్, దాతలకు, భక్తులకు ఆయన అభినందించారు. నియమ నిష్ఠలతో, పట్టుదలతో మండప నిర్మాణం పూర్తి చేసిన ప్రధాన అర్చకులు సుదర్శనాచార్యులు, శ్రీహర్షను ఘనంగా సత్కరించారు. అనంతరం రఘుపతిరావు దంపతులకు అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బాబురావు, కోశాధికారి రాజేందర్, మాజీ ఎంపీటీసీ వీరారావు, శ్రీరాములు రమేష్, భాస్కర్ పాల్గొన్నారు.

పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలి

• **సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్**

నర్సంపేట, ఆగస్టు 9 : న్యాయవాదులపై దాడిచేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలని సీనియర్ న్యాయవాది అంబటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. న్యాయవాదులపై దాడిని నిరసిస్తూ రాష్ట్ర ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ పిలుపు మేరకు శుక్రవారం విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగామ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు విషయంలో మాట్లాడడానికి వెళ్ళిన అమృతరావు, కవిత న్యాయవాద దంపతులపై దాడిచేసిన పోలీసు అధికారులను సస్పెండ్ చేయాలనికోరారు. కార్యక్రమంలో నర్సంపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పుట్టపాక రవి. సీనియర్ న్యాయవాదులు పింగిళి మాధవరావు, తండ సారంగపాణి, తొగరు నర్సింహారెడ్డి, అర్.లక్ష్మీనారాయణ, మోటూరి రవి, అంబటి రాజ్‌కుమార్, కొంగరి రాజు, కంసాని అశోక్, బొడ్డుపెల్లి అజయ్, పొనుగోటి అజయ్, పండగ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూతురు సహా జర్నలిస్టు ఆత్మహత్య

(5వ పేజీ తరువాయి)

ఇంటినుంచి కూతురిని తీసుకెళ్లిన యోగిరెడ్డి సాయంత్రానికి కూడా ఇంటికి రాక పోవడం, పలుమార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చిన భార్య స్వప్న ఆఫీసు వద్దకు వెళ్లి చూడగా కూతురు సహా యోగిరెడ్డి ఉరేసుకుని కనిపించడంతో ఆమె నిర్ఘాంతపోయారు. ఇద్దరినీ అలా చూసిన ఆమె కన్నీరుమున్నీరయ్యారు. విషయం తెలుసుకున్న ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనకు గల కారణాలు తెలుసుకునేందుకు వివరాలు సేకరిస్తున్నారు.

జర్నలిస్టుల సంతాపం..

యువజర్నలిస్టు యోగిరెడ్డి కూతురుతో కలిసి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకోవడంతో తోటి జర్నలిస్టులు విషాదంలో మునిగిపోయారు. ఘటనా స్థలానికి చేరుకున్న కొందరు జర్నలిస్టులు కన్నీరు పెట్టుకున్నారు. పోలీసులు యోగిరెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన వివరాలను సేకరిస్తున్నారని తెలిపారు.

అవినీతికి అడ్డుకట్టేదీ?

విచారణ లోపమా.. పాలకుల నిర్లక్ష్యమా!

ఇబ్బందులు పడుతున్న నల్లబెల్లి పీఏసీఎస్ రైతులు

నల్లబెల్లి, ఆగస్టు 9 : నల్లబెల్లి ప్రాథమిక సహకార సంఘంలో అక్రమాలు, అవినీతికి అడ్డూఅదుపు లేకుండాపోతోంది. దీనికి అడ్డుకట్ట వేయడంలో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. నల్లబెల్లి పీఏసీఎస్‌లో కొన్నేళ్లుగా తిష్ట వేసిన చైర్మన్, సీఈవోల ఆగడాలకు అంతులేకుండా పోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నల్లబెల్లి పీఏసీఎస్ పేరుతో నాడు గన్నీ బ్యాగుల కుంభకోణం, నేడు రైతుల ఆధార్ కార్డు తప్పిదంతో రుణమాఫీలో అక్రమాలు, అవినీతి జరుగుతున్నాయి. అంతేగాక సొసైటీ పేరుతో భూముల కొనుగోలు, అమ్మకాల్లో ఎవరి వాటా వారికే అందుతోంది. సొసైటీలో చైర్మన్, సీఈవోలు రైతులను తీవ్రంగా మోసం చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తారని మండలంలో తీవ్ర చర్చ జరుగుతోంది. సొసైటీలో ఇంత అక్రమాలు జరుగుతున్నా ఉన్నతాధికారులు, పాలక వర్గం ఎందుకు పట్టించుకోవడంలేదని తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సొసైటీ అక్రమాలపై నిజాయితీతో కూడిన విచారణ కమిటీ వేసి, సమగ్ర విచారణ చేసి అక్రమార్కులకు చట్టపరమైన శిక్ష వేయాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.


పీఏసీఎస్ చైర్మన్‌తో వాగ్వాదం చేస్తున్న రైతులు (ఫైల్)

తీసుకున్న రుణం కంటే ఎక్కువ చూపుతున్నారు

కొమ్ము రాజు, రైతు, నందిగామ



2020లో డీసీసీబీ నర్సంపేటలో రూ.75వేలు పంట రుణం తీసుకున్నా. రాష్ట్రం ప్రభుత్వం విడుదల చేసిన మొదటి విడత రుణమాఫీ కాలేదు. ఎందుకు కాలేదని పరిశీలించగా డీసీసీబీలో రూ.లక్ష92 వేలు పంట రుణం తీసుకున్నట్టు ఉంది. డీసీసీబీ వారిని నిలదీయగా నల్లబెల్లి సొసైటీలో అడగమని చెప్పారు. సొసైటీకి వచ్చి అడుగగా తప్పిదం జరిగిందని, నాతో రాజీ కుదిర్చే ప్రయత్నం చేస్తున్నారు.

పీఏసీఎస్‌కు ఆధార్ కార్డులు ఎలా వచ్చాయి?

ఆధార్ కార్డుల తప్పిదంతోనే రైతు పంట రుణాల్లో తప్పిదాలు జరిగాయని నల్లబెల్లి సొసైటీ బాధ్యులు చెడుతుండగా.. అసలు సభ్యత్వమేలేని రైతుల ఆధార్ కార్డులు ఎలా వచ్చాయని బాధితుల నుంచి ప్రశ్నలు ఎదురవుతున్నాయి. వ్యవసాయశాఖ నుంచి రైతుల ఆధార్ కార్డులు సొసైటీ వారు తీసుకోవాల్సిన అవసరమేంటన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీసీసీబీ, పీఏసీఎస్ సమ్మతంతోనే సభ్యత్వం లేని రైతుల ఆధార్ కార్డుతో రుణాలు తీసుకొని ఎవరి వాటా వాళ్ల పంచుకుందామని ఉద్దేశంతో చేశారా.. అనే అనుమానాలు రైతుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈ తతంగం బయటకు వచ్చే సరికి సొసైటీ చైర్మన్, సీఈవో సిబ్బంది పొరపాటు జరిగిందని అనడంలో నిజం కనిపించడంలేదని రైతులు చెబుతున్నారు. ఎందుకంటే ఏ రైతులకైతే సొసైటీ ద్వారా అక్రమంగా అప్పు భారం ఉందని తెలిసినా వెంటనే ఆయా రైతులతో రాజీ చేసుకునేందుకు మీ డబ్బులు మీకు ఇస్తామని పలుకుబడి కలిగిన వ్యక్తుల సాయంతో ఆ రైతులతో సెటిల్‌మెంట్ చేసుకుంటున్నారని వదంతులు వస్తున్నాయి. పీఏసీఎస్‌లో తప్పే జరగలేదన్నప్పుడు సెటిల్‌మెంట్‌కు రైతుల వద్దకు ఎందుకు వస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



డీసీసీబీ వద్ద ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రైతు ఐలయ్య (ఫైల్)

సొసైటీ పేరుతో భూ దందాలు

నల్లబెల్లి సొసైటీ పేరుతో భూముల క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. ఒకచోట భూమికొని మళ్లీ ఎక్కువ రేట్లతో భూములు అమ్మడం వీరికి పరిపాటి అయింది. లాభార్జన ధ్యేయంగా అక్రమార్జనే లక్ష్యంగా భూముల క్రయవిక్రయాలు సొసైటీ చైర్మన్, సీఈవోలు పనిచేస్తున్నారని ప్రచారం జరుగుతోంది. కొన్నేళ్లుగా అక్రమాలు జరుగుతుంటే సంబంధిత ఉన్నతాధికారులు విచారణలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రైతుల సంక్షేమానికే రుణమాఫీ

చెన్నారావుపేట, ఆగస్టు 9 : రైతుల సంక్షేమం కోసమే ప్రభుత్వం రుణమాఫీ చేసిందని సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సహకార సంఘం ఆవరణలో రుణమాఫీ పొందిన రైతులకు చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్, సాదు మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్లు రాంబాబు. గూళ్ల కవిత, ఎడ్ల మంజుల, జున్నూతుల రమాదేవి, పూల్ శంకర్, సీఈవో చిట్టె రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ పొలంబాట

పర్వతగిరి, ఆగస్టు 9: విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పర్వతగిరి, ఏనుగల్లు గ్రామాల్లో అధికారులు పొలంబాట పట్టారు. రైతులకు విద్యుత్‌వాడకంలో వ్యవసాయ పంపుసెట్ల వద్ద పాటించవలసిన భద్రతా నియమాలు, విద్యుత్ పొదుపు, కెపాసిటర్ల వినియోగంపై అవగాహన కల్పించారు. డీఈ భిక్షపతి మాట్లాడుతూ రైతులు వ్యవసాయపొలాల వద్ద విద్యుత్‌ను జాగ్రత్తగా వినియోగించాలని, ప్రమాదాలబారిన పడకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈకార్యక్రమంలో పర్వతగిరి ఏడీఈ చంద్రమౌళి, ఏనుగల్లు సెక్షన్ ఏఈ రవి, రైతులు పాల్గొన్నారు.

సఖి సేవలను వినియోగించుకోవాలి

రాయపర్తి, ఆగస్టు 9 : మహిళలు, బాలికలు సఖి సెంటర్ సేవలను వినియోగించుకోవాలని లీగల్ కౌన్సిలర్ శోభారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని మొరిపిరాల, కొలన్‌పెల్లి గ్రామాల్లో మహిళా సంఘాలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సఖి సెంటర్ ద్వారా బాధిత మహిళలకు, బాలికలకు రక్షణ, భద్రత ఉంటుందన్నారు. అత్యావసర పరిస్థితుల్లో మహిళలు హెల్ప్‌లైన్ 181కు డయల్ చేయాలని, తద్వారా న్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు

దుగ్గొండి, ఆగస్టు 9 : వాహనదారులు రోడ్డు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఏసీపీ కిరణ్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని గిర్నిబావిలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేసి మాట్లాడారు. వాహనదారులు అన్ని రకాల ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, మద్యంతాగి వాహనాలు నడపరాదన్నారు. సబ్ డివిజన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీలో 168 మోటర్ సైకిళ్లు, 69 కార్లు, 22 ఆటోలు, తనిఖీ చేసి 52 వాహనాలకు జరిమానా విధించినట్లు ఏసీపీ వెల్లడించారు. ఈ తనిఖీలో సీఐ రాజగోపాల్, ఎస్సైలు నీలోజు వెంకటేశ్వర్లు, రఘుపతి, ప్రశాంత్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

చెన్నారావుపేట, ఆగస్టు 9: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని మగ్దుంపురం గ్రామ శివారులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థులు. ప్రత్యేక్ష సాక్షుల కథనం ప్రకారం... మండలంలోని పాతమగ్దుంపురం గ్రామానికి చెందిన సుతారి శేఖర్ అనే వ్యక్తి బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. నర్సంపేటలో పని ముగించుకొని తన ద్విచక్ర వాహనంపై చెన్నారావుపేటకు వస్తున్నాడు. ఈ క్రమంలో జోజిపేట నారాయణతండాకు చెందిన దారావత్ రమేష్ అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై నర్సంపేటకు వెళ్తున్నాడు. ఎదురెదురుగా ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో శేఖర్ తలకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే నర్సంపేటలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్య చికిత్స కోసం శేఖర్ వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. కాగా, ఈ ఘటనలో రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

ఖానాపురం, ఆగస్టు 9 : ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని మండలంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మంగళవారిపేటలో తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు గొంది నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో డీటీడీవో సౌజన్య ముఖ్య అతిథిగా కొమరంభీమ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆదివాసి జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా అశోక్‌నగర్ గిరిజన సైనిక పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, ఎలిక్యూషన్, పెయింటింగ్, ఫ్లోర్ ఆర్ట్, సింగింగ్, డ్యాన్స్, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గట్ల సుదర్శన్, డైరెక్టర్ వైఎస్‌రావు, వైస్ ప్రిన్సిపాల్ శెరి కుమార్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ మిత్రకు సన్మానం

దుగ్గొండి, ఆగస్టు 9 : మండలంలోని మందపల్లి గ్రామ శాఖ ఏపీజీవీబీలో బ్యాంక్ మిత్రగా పని చేస్తున్న రౌతు సౌందర్యను శుక్రవారం హన్మకొండలోని ఏపీజీవీబీ రీజినల్ కార్యాలయంలో ఆర్ఎం నాగచైతన్య సన్మానించారు. గ్రామ స్థాయిలో బ్యాంక్ ఖాతాదారులకు బ్యాంక్‌మిత్రగా అందుబాటులో ఉండి వివిధ రకాల సూచనలు అందించారు. రికరింగ్ డిపాజిట్స్, బ్యాంక్ బీమా ఇన్సూరెన్స్‌లు చేయించడంలో ముందు స్థానంలోనిలిచారు. బ్యాంక్ అధికారులు బ్యాంక్ మిత్ర సేవలు గుర్తించి సన్మానంతో పాటు బహుమానం అందించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ ఎంజెఐ కిశోర్ బాబు, జిల్లా శాఖ హెడ్ శోభన్‌బాబు, నర్సంపేట డివిజన్ ఐరెక్స్ ఛానల్ మేనేజర్ కొర్ర నర్సిహలు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయపర్తి, ఆగస్టు 9 : మండలంలోని సన్నూరు, కొలన్‌పెల్లి సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ కన్న రాజు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా సన్నూరులో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, కొనలపెల్లిలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

• దుగ్గొండి : మండలంలోని గిర్నిబావి, తిమ్మంపేట విద్యుత్ సబ్ స్టేషన్‌లో సాంకేతిక పరమైన మరమ్మతుల కారణంగా ఆయా గ్రామాల పరిధిలో శనివారం ఉదయం 8గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌చార్జ్ ఏఈ రామకృష్ణ శుక్రవారం పేర్కొన్నారు.

తపాలా సేవలు వినియోగించుకోవాలి

దుగ్గొండి, ఆగస్టు 9 : తపాల శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న వివిధ రకాల తపాల పొదుపు పథకాలు, సేవలను ఖాతాదారులు, ప్రజలు సద్వినియోగం పరుచుకోవాలని జిల్లా సహాయ సూపరింటెండెంట్ దక్షణ ఉప మండలం అధికారి పి. వరప్రసాద్ పిలుపు నిచ్చారు. మండలంలోని తిమ్మంపేట సబ్ పోస్టాఫీసు కార్యాలయం అవరణలో శుక్రవారం బీపీఎం బొడె ప్రభాకర్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా మాట్లాడారు. కార్యక్రమంలో మెయిల్ ఓవర్సీర్ అలువాల సుమన్, స్థానిక తపాల సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

30న తొర్రూరులో కవులు, కళాకారులకు సన్మానం

నర్సంపేట, ఆగస్టు 9 : తొర్రూరులో ఈ నెల 30న గిద్దెగళం ఆధ్వర్యంలో గద్దరన్న అవార్డు 2024 పేరుతో కవులు, కళాకారులను సన్మానించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కవియోచన కళాకారులు తాళ్ళ సునీల్ పిలుపు నిచ్చారు. పట్టణంలో గదరన్న అవార్డు 2024 పేరుతో ముద్రించిన కరపత్రాలను శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాకారులు నెల్లుట్ల సుమన్, గుండెకారి సునీల్, లింగన్న, గాదెపాక బాబు పాల్గొన్నారు.

వృక్ష సంపదను పెంచాలి

నెక్కొండ, ఆగస్టు 9: జీవ కోటికి ప్రాణవాయువును అందిస్తున్న వృక్ష సంపదను పెంచే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ పీ.రవీందర్ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నెక్కొండలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మొక్కలు నాటినారు. కార్యక్రమంలో నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్, నెక్కొండ సీఐ చంద్రమోహన్, నర్సంపేట టీపీసీసీ మెంబర్ రంజిత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, ఎస్సై మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట : పట్టణంలోని అరబిందో హైస్కూల్ (శ్రీచైతన్య) విద్యార్థులతో కలిసి సీఐ సూర్యప్రకాష్ మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, రాజు,పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌సింగ్, డీన్ వీరన్న, సారయ్య, కల్యాణి, రెహానాతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

• వర్ధన్నపేట రూరల్ : పల్లెలు పరిశుభ్రతతో వెల్లివిరియాలని మండల ఎంపీవో, దమ్మన్నపేట స్పెషల్ ఆఫీసర్ అంకం ధనలక్ష్మి అన్నారు.మండలంలోని దమ్మన్నపేటలో వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉప్పరపెల్లిలో బృహత్తర పల్లె ప్రకృతి వనంలో వన మహోత్సవం నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్, ఏడీఏ సురేష్ కుమార్, ఎంపీడీవో వెంకటరమణ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప్పరపెల్లి గ్రామాన్ని దతత్తతీసుకున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం వేణు, ఏపీవో నాగేశ్వర్‌రావు, కార్యదర్శి సహజ, సీసీ కొమురయ్య పాల్గొన్నారు.

• పర్వతగిరి: మొక్కలు నాటి సంరక్షించాలని డీసీవో, మండల స్పెషల్ ఆఫీసర్ బి.సంజీవరెడ్డి అన్నారు. మండలంలోని అనంతారంలో మెగాప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అధికారులు, పలుశాఖల సిబ్బంది, మహిళా సంఘాల బాధ్యులు మొక్కలు నాటారు. అనంతరం ఎంపీడీవో శంకర్ నాయక్ పర్వతగిరి, ఏనుగల్లు సబ్‌స్టేషన్‌లతో పాటు, గోపనపెల్లి, సీకె తండా, చింతనెక్కొండలో మొక్కలునాటారు. కార్యక్రమంలో ఏడీఈ చంద్రమౌళి, ఎంపీవో శ్రీనివాసులు, ఏఈ రవికుమార్, ఏపీవో సుశీల్‌కుమార్, ఈసీ రాజు, ఏపీఎం కృష్ణమూర్తి, సీసీలు రవీందర్‌రాజు, కాంతయ్య, కార్యదర్శులు పాల్గొన్నారు.

• ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో డీటీడీవో సౌజన్య, ఎంపీడీవో భారతి, ఏపీవో సునిత, డీసీసీ అధికార ప్రతినిధి తక్కళ్లపల్లి రవీందర్‌రావులు మొక్కలునాటారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో ప్రకాష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్‌వో మేనక, వైద్యాధికారి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

• దుగ్గొండి : భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా ప్రతీ గ్రామంలో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఉద్యానవన శాఖ డీప్యూటీ డైరెక్టర్ మండల ప్రత్యేక అధికారి సంగీతలక్ష్మీ పిలుపు నిచ్చారు. మండలంలోని వెంకటాపురంలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలు కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీసీఈవో రాంరెడ్డి, ఎంపీడీవో లెక్కల అరుంధతి, ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి వైనాల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

• రాయపర్తి : గ్రామాల్లోని మహిళలు తప్పనిసరిగా తడి, పొడి చెత్తను వేరు చేసి గ్రామపంచాయతీ సిబ్బందికి సహకరించాలని మండల స్పెషల్ ఆఫీసర్ నాగమణి సూచించారు.మండలంలోని కొండూరులోమహిళా సంఘాల సభ్యులకు, విద్యార్థులకు మొక్కలు నాటే కార్యక్రమంతో పాటు తడి, పొడి చెత్త సేకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కిషన్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో ప్రకాష్, హెచ్ఎం పద్మలత పాల్గొన్నారు.

సల్లంగ సూడు నాగన్నా..

ఘనంగా నాగుల పంచమి వేడుకలు

పుట్టలో పాలుపోసి మొక్కులు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

వరంగల్ కల్చరల్, ఆగస్టు 9 : శ్రావణ శుద్ధ పంచమిని పురస్కరించుకొని శుక్రవారం నాగుల పంచమి వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. నాగేంద్రస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గీసుగొండ మండలం ఊకల్‌లోని బాల నాగసుబ్రహ్మణ్యేశ్వర దేవాలయం, వరంగల్‌లోని ఉర్సు నాగేంద్రస్వామి దేవాలయం, భద్రకాళి ఆలయంలోని నాగేంద్రస్వామి దేవాలయం, ఎల్లంబజార్‌లోని నాగ్రేందస్వామి దేవాలయంతోపాటు అన్ని మండలాల్లో పూజలు జరిగాయి. పుట్టల వద్ద మహిళలు పాలు పోసి పసుపు, కుంకుమలతో మొక్కులు చెల్లించుకున్నారు. ఊకల్‌లోని బాలనాగ సుబ్రహ్మణ్యేశ్వర దేవాలయంలో తెల్లవారుజాము నుంచే పంచామృతాలతో, పండ్ల రసాలతో, సుగంధ ద్రవ్యాలతో విభూది గంధ హరిద్ర కుంకుమలతో అభిషేకాలు కొనసాగాయి. నగరంలోని ఉర్సు నాగేంద్రస్వామి దేవాలయం, ఎల్లంబజార్‌లోని నాగేంద్ర స్వామి ఆలయం, భద్రకాళి దేవాలయంలోని నాగేంద్రస్వామి ఆలయాల్లో పట్టులో పాలు పోసి పూజలు చేవారు.

భద్రకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు

శ్రావణ మాసం మొదటి శుక్రవారం భద్రకాళి అమ్మవారి దేవాలయం భక్తులతో పోటెత్తింది. ఉదయం 4 గంటలకు సుప్రభాత సేవతో ప్రారంభమైన అమ్మవారి పూజ నిత్యాహ్నికం అనంతరం అమ్మవారి అలంకరణ, హారతి నివేదన జరిగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పోటెత్తడంతో క్యూలైన్లు కిక్కిరిసాయి.అమ్మవారికి ఒడి బియ్యం, చీరలను భక్తులు సమర్పించారు. భక్తుల సందడి పెరగడంతో ప్రత్యేక క్యూలైన్ల ద్వారా దేవాలయ సిబ్బంది దర్శనాలకు ఏర్పాట్లు చేశారు.


సర్వాపురం నాగమయ్య గుడి వద్ద పుట్టకు పూజలు చేస్తున్న మహిళలు

అమ్మవారి ఆదాయం రూ.4.40లక్షలు

భద్రకాళి అమ్మవారి దేవాలయంలో శ్రావణ శుక్రవారం ఒక్కరోజే హుండి, ప్రసాదాలు, పూజ టిక్కెట్లు, వాహనాలపూజ టిక్కెట్ల ద్వారా రూ.4.40లక్షలు లభించింది. దేవాలయ చరిత్రలో ఒక్కరోజు హుండీ ఆదాయం రావడం రికార్డ్ అని ఈవో శేష భారతి తెలిపారు.


నర్సంపేట ఫారెస్టు కార్యాలయం వద్ద పుట్టకు మహిళల పూజలు

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

వరాలనిచ్చే వరలక్ష్మి, సౌభాగ్యానిచ్చే సంతాన లక్ష్మి, ధాన్యానిచ్చే ధనలక్ష్మి.. మమ్ములను కరుణించూ అంటూ మహిళలు శ్రావణ శుక్రవారం వేళ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు చోట్ల సామూహిక వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించారు. హంటర్ రోడ్డులోని శ్రీసంతోషిమాత, శ్రీరాజరాజేశ్వరి ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలను ఆచరించుకున్నారు.

నర్సంపేట నియోజకవర్గంలో...

నర్సంపేట: నియోజకవర్గంలోని నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, ఖానాపురం, చెన్నారావుపేట. నెక్కొండ మండలాల్లోని భక్తులు శుక్రవారం నాగుల పంచమివేడుకలను ఘనంగా జరుపుకున్నారు. దేవాలయాలకు భక్తులు వెళ్ళి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణంలోని ఫారెస్టు కార్యాలయం సమీపంలోని నాగమయ్య దేవాలయంలోని, పోచమ్మ దేవాలయంలోని పుట్టలకు మహిళలు పూజలు పసుపు, కుంకుమలవేసి పుట్టలో పాలు పోసి భక్తిని చాటుకున్నారు. సర్వాపురం శివారులోని పంట పొలాల వద్ద గల నాగమయ్యగుడిలోని పుట్టలో పాలు పోసి భక్తిని చాటుకున్నారు. అలాగే చెన్నారావుపేట మండల కేంద్రంలోని సిద్దేశ్వరాలయంలోని నాగమయ్య విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.